క్లుప్తంగా

కౌన్సెలింగ్ విధానంలో మార్పు వద్దు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్ విధానంలో మార్పులు చేయవద్దని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరి సీవీ.ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సిఫారసులకు అవకాశం లేని బదిలీల కౌన్సిలింగ్ విధానం ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వమే నేడు రిక్వెస్ట్ బదిలీలకు వివరాలు పంపాలంటూ డీఈఓలకు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. రాజకీయాలకు తావులేని బదిలీలు ఉండాలని విద్యా మంత్రి చేసిన వ్యాఖ్యలు హర్షణీయమన్నారు. ప్రతి వేసవిలో బదిలీలు జరిగేలా కోడ్ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సేవలకు కలెక్టర్ ప్రశంస



బాల సుబ్బయ్యకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివారులోని బృంద వృద్ధాశ్రమంలో వృద్ధులకు తన వంతు సేవలందిస్తున్న బాలసుబ్బయ్యకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రశంసా పత్రం అందజేశారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని వృద్ధాశ్రమాల నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కృష్ణ కిశోర్, దేవానంద్, స్వచ్ఛద సంస్థలు, వృద్ధాశ్రమాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముందస్తు గాంధీ జయంతి



దేశ నాయకుల వేషధారణతో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివారులోని పీఎం కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం ముందస్తు గాంధీజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సత్య ప్రసాద్ జ్యోతి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల దేశ నాయకుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు దోష నివారణ కోసం మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా రాహుకాల పూజలు జరిపారు. అమ్మవారికి నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగికి పురస్కారం



మహేష్‌ను సత్కరిస్తున్న హనుమంతరావు

కడప కల్చరల్: కడప ఆకాశవాణి కేంద్రం ఉద్యోగి యుండూరు మహేష్‌కు మొల్ల సాహితీ పీఠం మొల్లమాంబ పురస్కారాన్ని ఆ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, కార్యదర్శి మనోజ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ మహేష్ అకాశవాణి సాహిత్య కార్యక్రమాల్లో చొరవ తీసుకుని నాణ్యతగల కార్యక్రమాలు ప్రసారం అయ్యేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం మహేష్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో భవానీప్రసాద్, రవికుమార్‌రెడ్డి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ధ్యాన దసరా ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

కడప కల్చరల్: ఈ నెల 5వ తేదీ నుంచి 7వతేదీ వరకు జరగనున్న ధ్యాన దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ కలెక్టర్ శివశంకర్ లోతేటిని వాసవీ కన్యకా పరమేశ్వరీ పిరమిడ్ మహా క్షేత్రం సభ్యులు మంగళవారం ఆహ్వానించారు. పొట్లదుర్తి గ్రామం బిస్మిల్లాబాద్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో యోగులు, ధ్యానులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు సతీష్, అనిల్ కుమార్, సుదీప్తి, ప్రత్యూష, ఓబయ్య, సృజనాదేవి పాల్గొన్నారు.

డీఎస్‌ఓ సేవలు మరువలేనివి

కడప కార్పొరేషన్: డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా సుభాషిణి అందించిన సేవలు మరువలేనివని రిటైర్డ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ దాసరి సుధాకర్ అన్నారు. జమ్మలమడుగు ఆర్‌డీఓ ఆఫీసులో పనిచేసి సుభాషిణి పదవీ విరమణ చేసిన సందర్భంగా కడప చీఫ్ ప్లానింగ్ కార్యాలయంలో ఉద్యోగులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ 35 సంవత్సరాల 8నెలలు సర్వీసు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమని, పదవీ విరమణ కాలంలో ఆయురారోగ్యాలతో ప్రశాంత జీవనం గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి.. ఆపదలో ఉన్న ఇతరుల ప్రాణాలు కాపాడాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. శిబిరంలో 70 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం శిబిరం నిర్వాహకులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ రాజేంద్ర, ఖూన్ కా రిస్తా సంస్థ అధ్యక్షుడు తారిఖ్ అహ్మద్, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం ప్రోగామ్ మేనేజర్ అలీ హైదర్, జీజీహెచ్ సిబ్బంది పీవీ ప్రసాద్, జిల్లా సూపర్‌వైజర్ అబ్దుల్‌సాధిక్ పాల్గొన్నారు.

ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో

కడప ఎడ్యుకేషన్: జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కడప బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు మంగళవారం రక్తదానం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భోగాపార్వతమ్మ రక్తదాన సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ వీరసుదర్శనరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేంద్రపాల్గొన్నారు.

వైవీయూ: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీం బాషా అన్నారు. స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా బుధవారం రక్తదాన శిబిరం ఏర్పా టు చేశాయి. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతో పాటు సేవా గుణం అలవరచుకోవాలని, రక్త దానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని పేర్కొన్నారు. అనంతరం పలువురు వాలంటీర్లు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి.విజయలక్ష్మిదేవి, ఎన్‌సీసీ అధి కారి డాక్టర్ స్వరూప, అధ్యాపకులు డా.గురు మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

వైవీయూ రిజిస్ట్రార్‌గా ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి



రామప్రసాద్‌రెడ్డికి రిజిస్ట్రార్‌గా నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ కె. కృష్ణారెడ్డి

వైవీయూ: వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా తెలుగు విభాగం ప్రొఫెసర్ తప్పెట రామప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి తన చాంబరులో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఇదివరకు ఈ స్థానంలో ఉన్న ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి రిలీవ్ అయ్యి ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ కు బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నియామకపు పత్రం అందజేసే కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జయరామిరెడ్డి పాల్గొన్నారు.

హోటళ్లు, రెస్టారెంట్ల సమయాన్ని పొడిగించాలి



కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కడప హోటల్ అండ్ ఫుడ్ అసోషియేషన్ ప్రతినిధులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో హోటళ్లు, రెస్టారెంట్లను అర్ధరాత్రి 12 గంటల వరకూ తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలని కడప హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను మంగళవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.చిన్నప రెడ్డి, అధ్యక్షుడు కెఎం.రషీద్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ టీ.చంద్రశేఖర్, సభ్యులు రామక్రిష్ణారెడ్డి, మహ్మద్ ఆజమ్, ఖజానా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

● ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు విడుదల చేయాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం జరిగిన కడప నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల మెస్ బిల్లులు మాత్రమే విడుదల చేసిందన్నారు. మిగతా నెలల బిల్లులు ఇవ్వకపోవడంతో వార్డెన్లు హాస్టళ్లు నడపలేకపోతున్నారన్నారు. పోషకాహారం లేక విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారని, తిరిగి రావడం లేదని తెలిపారు. ఖాళీగా ఉన్న హాస్టల్ సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అనంతరం ఆర్‌ఎస్‌యూ కడప నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు కొండేటి హరిబాబు, వెంకటేశ్వర్‌నాయక్, ప్రమోద్, సాయిచరణ్, శామ్యూల్, సందీప్, చెంగల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సేవా దృక్పథం అభినందనీయం

వైవీయూ వీసీ కృష్ణారెడ్డి



ప్రదర్శన తిలకిస్తున్న వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

వైవీయూ: విద్యార్థులు చదువుతోపాటు ఇతరులకు సహాయపడాలనే ఆలోచన చేయడం అభినందనీయమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో అనాథలు, వృద్ధుల సహాయార్థం మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'కైండ్ హార్ట్స్ బై ఫైన్ ఆర్ట్స్' కార్యక్రమం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఈ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన పలు వస్తువులను కొనుగోలు చేసి ఈ కార్యక్రమంలో భాగస్వామి అయ్యాడు. కరస్పాండెంట్ బి.మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ బి.శివవిష్ణుమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.కె.సూర్యనారాయణరెడ్డి, ఎస్.శ్రావణి, ఎల్.అనంతలక్ష్మి, ఎ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధుల దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చౌడమ్మ, బృంద వృద్ధాశ్రమాల్లో మంగళవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రటరి ప్రవీణకుమార్ సూచన మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వృద్ధులకు ఉచిత న్యాయ సహాయానికి 15100 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఎం.శాంత, ఎ.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ



విత్తన ప్యాకెట్లను అందజేస్తున్న అధికారులు

కడప అగ్రికల్చర్: మినుములో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్ర పోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. ఆపరాల ఆదర్శ గ్రామం కింద వల్లూరు మండలం దిగువపల్లె గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు మినుములో సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఆయన అవగాహన కల్పించారు.ఎల్‌బిజి–904 మినుమురకం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని, ఈ రకం పల్లాకు తెగులు తట్టుకోగలదని పంట వేసిన 70–75 రోజులకు చేతికి వస్తుందని పేర్కొన్నారు. కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, రైతు శిక్షణా కేంద్రం డీడీ రమణారెడ్డి మినుములో చీడపీడలు, తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం రైతులకు మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, ప్రశాంతి, వల్లూరు ఏవీ సాయిజ్యోతి, దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీఎస్‌ఎన్‌ఎల్ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం బీఎస్‌ఎన్‌ఎల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ఇప్పటికే 4జీ సేవలను అందుబాటులోకి తెచ్చిందని, వాటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ సంస్థల టెలికాం సేవలకు ధీటుగా తమ సేవలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో నైపుణ్యంపై శిక్షణ



బొకేల తయారీలో విద్యార్థినులు

వైవీయూ: మార్కెట్‌లో లభించే పుష్పాలతో బొకేలు, అలంకరణ సామగ్రి తయారీలో నైపుణ్యం కనబరిచేవారికి చక్కటి అవకాశాలున్నాయని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అన్నారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఎస్సీ, డీసీహెచ్ విభాగం విద్యార్థులకు బాస్కెట్ బొకె, ఫ్లాట్ బొకే, హ్యాండ్ బొకే, సింగల్ ఫ్లవర్ బొకే, పుష్పాలంకరణ అంశాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ శిక్షణను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.పి.సుబ్రహ్మణ్యం, నాగరత్నమ్మ, అనురాధ, శాలీం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు కల్పించే అన్ని సౌకర్యాలను మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. డీఈఓ మర్రెడ్డి అనురాధను మంగళవారం కలిసి రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనకు సంబంధించిన నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్స్‌లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరని, 3, 4, 5వ తరగతులను విలీనం చేశారేగానీ, స్కూల్ అసిస్టెంట్లను నియమించలేదని అన్నారు. మున్సిపల్ టీచర్ల జీతాల నుండి మినహాయించే సొమ్ము వారి పీఎఫ్ ఖాతాలకు జమ చేసేందుకు, అవసరాలకు వాడేందుకు అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, రామ కేశవ, మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాంబ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న పరిటాల వెంకట రమణ

కడప కల్చరల్: వాసవీ కన్యకాంబ నవరాత్రి ఉత్సవాలను గురువారం నుంచి పది రోజులపాటు నిర్వహించనున్నట్లు కడప ఆర్యవైశ్య సంఘం దసరా కమిటీ చైర్మెన్ పరిటాల వెంకటరమణ తెలిపారు. స్థానిక అమ్మవారిశాల వద్దగల వాసవీ భవన్‌లో ఆయన ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, అన్నపూర్ణ అలంకారం రోజున చిన్న పిల్లలకు ప్రత్యేకమైన ప్రసాదాన్ని అందజేస్తున్నామని తెలిపారు. గజలక్ష్మీదేవి అలంకారం రోజున ప్రత్యేకంగా ఏనుగు, విజయ దశమి రోజున గుర్రాలు, ఒంటెలు తెప్పించ నున్నట్లు తెలిపారు. అమ్మవారిశాలలో మొత్తం 13 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు బుధవరపు కృష్ణమూర్తి, ఎ సూరువినోద్, మునగా శ్రీనివాసులు, తల్లం సురేష్, చింతకుంట పుల్లయ్య, పడుచూరి వెంకటేశ్వర్లు, గోపాల్ పాల్గొన్నారు.

అమ్మవారి శాలలో...

దసరా సందర్భంగా అమ్మవారిశాలలో రోజూ విశేషంగా అలకరించనున్నారు. ఈ నెల 3న దీక్షా బంధనదేవి అలంకారం, 4న రాజరాజేశ్వరీదేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న గజలక్ష్మిదేవిగా, 7న మోహినీదేవిగా, 8న త్రిపుర సుందరీదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న మహిషాసుర మర్దినిగా, 11న వాసవీ కన్యకా పరమేశ్వరిగా అలంకరిస్తారు. అదే రోజున బిందెసేవ ఉంటాయి. 12న విజయలక్ష్మిదేవిగా అలంకరిస్తారు. 13న దోలాధిరోహణ, పవళింపు సేవ ఉంటాయి.

ప్రొటోకాల్ పాటించని అధికారగణం

శిలా పలకాలపై నమోదు కాని పేర్లు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ఆహ్వాన పత్రిక, శిలాఫలకాలపై పేర్లు లేకపోవడంతో ప్రొటోకాల్ పాటించలేదని పలువురు అధికారులపై మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధతో పాటు, కడప ప్రథమ పౌరుడు మేయర్ కె.సురేష్ బాబు పేర్లు కనిపించలేదు. కూటమి ప్రభుత్వానికి చెందిన మంత్రి సత్యకుమార్ యాదవ్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్లు మాత్రమే నమోదు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్లను కూడా నమోదు చేయలేదు. దీంతో కార్యక్రమాల ప్రారంభానికి ముందు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రభుత్వ దంతవైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎదుట ప్రిన్సిపల్, సూపరింటెండెంట్‌లను నిలదీసి ప్రొటోకాల్ పాటించకుండా ప్రజా ప్రతినిధులను అవమానపరుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు క్షమాపణలు చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. మరలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని 'క్యాథ్‌లాబ్' ముందు శిలాఫలకంపై కేవలం మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరును మాత్రమే నమోదు చేయించారు. దీంతో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మరోసారి ఆగ్రహించారు. అధికారులు తమ తప్పులను సరిదిద్దుకుంటామని వారికి నచ్చచెప్పారు.

అగ్నిమాపక అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

కడప అర్బన్: జిల్లా అగ్నిమాపక అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం కడపలో ఏకగ్రీవంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, శివరాం, రాష్ట్ర క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి నూర్‌బాషా ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు చేతుల మీదుగా గెలుపుపత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా అగ్నిమాపక అసోసియేషన్ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పి.సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.రాజశేఖర్, కార్యదర్శిగా ఎం.గురుశంకర్, జాయింట్ సెక్రటరీగా సిద్దేశ్వర, ట్రెజరర్‌గా ఎస్.వీరారెడ్డి, అడ్వైజర్‌గా కె.మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

4న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ /కడప ఎడ్యుకేషన్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కడపలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్, అభి గ్రీన్ టెక్నాలజీస్ సంస్థలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, గ్రూప్ లీడర్స్, రిలయన్స్ రీటైల్స్ లిమిటెడ్‌లో కస్టమర్ సేల్స్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు టెన్త్, అగ్రికల్చర్ డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివి 19–32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు వచ్చే సమయంలో విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలను తీసుకు రావాల్సి ఉంటుందన్నారు.

● ఈ నెల 4న చక్రాయపేటలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే జాబ్‌మేళాలో నవభారత్ ఫర్టిలైజర్స్‌లో మార్కెటింగ్, అమర్ రాజా గ్రూప్‌లో మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

కడపలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

కడప అర్బన్: కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సెక్షన్30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని కడప ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎస్.రమాకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా పోలీసులకు వినతి పత్రం ఇచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని డీఎస్పీ హెచ్చరించారు.

విద్యుత్తు ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

కడప కార్పొరేషన్: విద్యుత్తు ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యులు పాకా సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ నాలుగు త్రైమాసికాలకు కలిసి యూనిట్ రూ.4.14 నుంచి రూ.6.69 వరకు పెంచాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడం అన్యాయమన్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కంది పప్పు కొండెక్కి కూర్చొందన్నారు. సమావేశంలో కె.రాజశేఖర్‌రెడ్డి, ఎం.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్: ఇస్రో(శ్రీహరికోట) ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే వరల్డ్ స్పేస్ వీక్‌లో భాగంగా కడప మున్సిపల్ హైస్కూల్(మెయిన్)లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు గంగిరెడ్డి, ఇర్షాద్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు 9, 10వ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఉపాధ్యాయులు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థుల రాష్ట్ర పర్యటన

కడప కల్చరల్: జిల్లా విద్యార్థుల పంట పండింది. వారు ఏం కోరుకుంటారో ఆ ఆనందం అందుబాటులోకి వచ్చింది. ఈ మాసంలో వారు పది రోజులపాటు హాయ్..హాయ్... అంటూ రాష్ట్రంలోని పలు ప్రముఖ పర్యాటక వైజ్ఞానిక, సహజ సౌందర్య ప్రాంతాలను సందర్శించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం విద్యా శాఖతో కలిసి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా విద్యార్థులకు సంబంధించి తన శైలిలో వినోదం, విజ్ఞానాన్ని పంచి పెట్టేందుకు భారీ కార్యక్రమాన్ని రూపొందించారు. హైస్కూల్ విద్యార్థులు 500 మందికి పది రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా విద్య, వైజ్ఞానిక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. కడప నుంచి శాటిలైట్ ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోట మీ దుగా రాష్ట్రంలోని పలు దేవాలయాలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలతోపాటు విశాఖ పట్టణం, అరకులోయకు వారిని తీసుకువెళ్లనున్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కును ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుపైన కడప ఉక్కు పైన తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. నాడు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి సాధించుకున్న విశాఖ ఉక్కును నేడు నష్టాలు వస్తున్నయన్న సాకుతో కార్పొరేటు శక్తులకు అమ్మే ప్రయత్నం వంటి కుటిల ప్రయత్నాలు బీజేపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరపోగురవి, రాజశేఖర్ నిర్మల్, విజయ్, అభినయ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప తాలూకా పరిధిలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన రాజ్‌కుమార్ అనే రౌడీ షీటర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాజ్‌కుమార్ పలు నేరాలలో నిందితుడిగా వున్నాడని, తాజాగా ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. అతన్ని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

బాసటలో అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వి.రాజారత్నం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం బాసట చిల్డ్రన్స్ హోం చిన్నారులకు అన్నదానం నిర్వహించారు.